# మమకారం

అది ఒక చిన్న పల్లెటూరు. నాలుగైదు వందల ఇండ్లకన్నా ఎక్కువ ఉండవు. ఊరిపక్కనే వాగు, వాగు నానుకుని కొండ, కొండపైన చెట్లు, చూడ్డానికి అందంగా ఉంటాయి. నర్సయ్య ఆఊళ్ళో ఒక పేదరైతు. పూర్వార్జితమైన రెండెకరాల కొండ్ర, తండ్రి సంపాయించిన పది గొర్రెలు, మూడుగదుల మిద్దె, జత ఎద్దులూ, అతని యావదాస్థి. చిన్నతనంలోనే తండ్రి పోవడంవల్ల చదువు సంధ్యలు వదిలేసి నర్సయ్య నాగలిపట్టాడు. కోడి కూత విని లేచి కోసేరువేసుకుని "కొండ్ర"కు పొయ్యేవాడు. ఎండనకా, వాననకా, దున్నుకుని పొద్దు నెత్తిమీది కొచ్చిం తర్వాత ఇంటికొచ్చేవాడు. బొక్కెడన్నం తిని ఒక్క నిముషమైనా కూర్చోకుండా చుట్ట కాలుస్తూనే గొర్రెలు తోలుకుని కొండమీది కెళ్ళేవాడు. కనుచీకటి పడే వేళకు కాయో, కసురో, కొనుక్కొని కొంప జేరేవాడు. ఈవిధంగా కాలం గడిచిపోయింది. కష్టానికి తగ్గట్టు కరువు కాటకాలు లేకుండా ఏటేటా వర్షాలు కురిసేవి. క్రమేణా నర్సయ్యకు ఫలసాయం పెరగసాగింది. "ఎంతకాలం చెయ్యి కాల్చుకోవడం" అనుకుని కులమింటి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. భార్య వచ్చిన సంవత్సరం ఎప్పుడూ పండని పంట పండింది. గొడ్డొచ్చినా, బిడ్డొచ్చినా, వేళావిశేషం అనుకున్నాడు నర్సయ్య. తిండికి సరిపోయే గింజలు గరిసెలో పోసుకుని మిగతావి పాతర వేయించేవాడు. మరికొంత "మాలు" అమ్మి రొఖ్ఖం మూటగట్టాడు. ఎంత సంగ్రహించి సంపాదించినా, కొంత ఖర్చు కాక తప్పేదికాదు. వచ్చేవారూ, పోయేవారూ, పురుళ్ళూ, పుణ్యాలూ, పండగనీ, పబ్బమనీ, నలుగురితోపాటూ అన్నీ జరుపుకుంటూ ఉండేవాడు నర్సయ్య. ఇంత సంపాయించినా తనకు చిరిగిపోయిన చొక్కా, ముతకపంచె తలగుడ్డ, మోకాళ్ళపైకి ధోవతీ, చెవులో రెండుసార్లు కాల్చిన చుట్టా, మనిషి చాలా వినయంగా తలవంచి మాట్లాడుతాడు. ఇతన్ని చూసిన ప్రతివారూ సంపాయించాడని అనుకోరు. నర్సయ్యకిప్పుడు నలభైఏండ్లు. ఇద్దరు బిడ్డలు. రమణయ్య చేతి కెదిగాడు. రావమ్మ పెండ్లీడు కొచ్చింది. బంధువులు అక్కడక్కడా సంబంధాలు చెప్పారు. నర్సయ్యకవేవీ చెవికెక్కడంలేదు. మున్నబుగారబ్బాయి 'కోటయ్య' కివ్వాలని అతని ఉద్దేశ్యం. ఒక్కడే కొడుకు. భూమి, పుట్రా ఉంది. గ్రామంలో నౌకరి. తండ్రి ఇంకా సంపాయిస్తున్నాడు. ఊళ్ళో సంబంధం. ఒక్కపిల్ల. కళ్ళఎదట ఉంటుంది. కష్టం, సుఖం, విచారించవచ్చు. ఇదీ నర్సయ్య ఆశ. ఒకరోజు రచ్చబండమీద 'పిచ్చాపాటీ' మాట్లాడుతూ మున్నబుతో తన ఉద్దేశ్యాన్ని తెలియపరిచాడు. మున్నబు తొణకలేదు. తల ఊపి ఊరుకున్నాడు. 'చెప్పబావా! ఏవంటావ్' అన్నాడు నరసయ్య. 'సంబంధాలకేంవోయ్! చాలా వస్తున్నాయ్. 'ఇప్పుడేం తొందర' అంటున్నది నీ చెల్లెలు." అన్నాడు మున్నబు బెట్టుగా. నర్సయ్య గొంతు సవరించుకుంటూ 'ఊళ్ళోవాళ్ళం. స్నేహంగా ఉంటున్నాం. తథాస్తు అనుకుంటే తర్వాత ఎప్పుడైనా జరుపుకోవచ్చు. ప్రధానం రేపే పెట్టిస్తా" అన్నాడు. మున్నబు కడుపులో కళ్లు గలవాడు. "పాలెంనుంచి మొన్ననే పెద్దకాపు వచ్చాడుబావా! లాంఛనాలన్నీ జరిపి నాలుగువేల కట్నమిస్తా నన్నాడు. ఆలోచిస్తానని చెప్పా," అన్నాడు మున్నబు రీవిగా. "అదేమిటిబావా? నేను మాత్రం కాదన్నానా? ఏదో రెండువేల వరకూ...ఇస్తా" అన్నాడు నర్సయ్య నింపాదిగా. ఆరోజు సంభాషణ అంతటితో ఆగిపోయింది. మరి నాలుగురోజులు గడిచాయి. ఆరాత్రి నర్సయ్యభార్య సీతమ్మ "ఏవండీ! ఏవనుకున్నారు పిల్లవిషయం?" అంది నెమ్మదిగా అన్నం పెడుతూ. నర్సయ్య మాట్లాడలేదు. "ఎంతకాలం ఇట్లా? పద్నాలుగో ఏడు వచ్చింది. పదిమందికీ చెప్పలేక చస్తున్నా." అంది మళ్ళీ సీతమ్మ కొంచెం కష్టంగా. "నేనూ అదే ఆలోచిస్తున్నా! తొందరపడితే ఎట్లా? ఈ రోజుల్లో ఆడపిల్లను కనడంకంటె అడుక్కుతినటం మంచిది. అయినవాడూ, కానివాడూ కూడా అందలమెక్కి కూచుంటున్నారు. 'కానీ' సంపాయించడమంటే ఎంతకష్టమో వాళ్ళకేం తెలుస్తుంది? కట్నం, కట్నం, అని కాకిగోలచేస్తున్నారు." అన్నాడు నర్సయ్య మజ్జిగ పోసుకుంటూ. "అవును నిజమే. అందుకే ఇంత తినా, కుడవా, ఉన్నవాణ్ని చూచి ఇవ్వడం మంచిది. పెద్దపెద్ద సంబంధాలు మన కెక్కణ్నుంచి వస్తాయి. కాస్త మర్యాదస్తుణ్ని చూచి ఆ మూడుముళ్ళూ వేయిస్తే మనపని తీరిపోతుంది. రమణయ్యకా ఇప్పుడేం తొందరలేదు" అంది సీతమ్మ పొగాకుపట్టా బయటికి తెస్తూ. నర్సయ్య చేయి తుడుచుకుంటూ "నాకా మాత్రం తెలియదనుకున్నావా? మొన్ననే మున్నబుబావతో మాట్లాడాను. కలిగిన సంబంధం. కోటయ్యా, బుద్ధిమంతుడు. పిల్ల సుఖపడుతుంది" అన్నాడు సంతోషంతో. "ఆ! మున్నబు ఒప్పుకున్నాడా అండీ! అది కుదిరితే పిల్ల అదృష్టవంతురాలు. కట్నం అడగలేదా?" అంటూ ఆదుర్దాగా అడిగింది సీతమ్మ. "అదేకదూ చెప్తుంటా! కట్నం అడక్కపోవడవేమిటి? చాలా బెట్టుగా మాట్లాడాడు. రెండువేల వరకూ ఇస్తానన్నా. పెద్ద మొత్తంమీద ఆశ ఉన్నట్లుంది. విషయం తేల్చకుండా వెళ్ళిపోయాడు. మన రామయ్యతో మళ్లీ మాట్లాడమనిచెప్పా. ఏంజరిగిందీ రేపు తెలుస్తుంది." అన్నాడు నర్సయ్య చుట్ట ముట్టిస్తూ.

"అంతడబ్బు ఎట్లా ఒప్పుకున్నారండీ? సెట్టి బాకీ ఇంకా అట్లాగే ఉందన్నారు. మీ ఆలోచన నాకేమీ అర్థంకావడం లేదు." అంది సీతమ్మ మంచం వాలుస్తూ.

"అంతే లేవే నీకేం తెలుస్తుంది ఆడదా

## శ్రీ రెంటాల గోపాలకృష్ణ

నికి ఆమాత్రం చొరవ చూపించందే పన్లెలా అవుతయి. నలుగుర్లోనూ తిరిగే వాళ్ళం గౌరవం నిలబెట్టుకోవాలిగా. అన్నీ నే చక్కబెట్టుకుంటాలే." అన్నాడు నరసయ్య గంభీరంగా.

మర్రోజు రామయ్యొచ్చి షావులో ఊదాడు "లాభంలేదనీ, మున్సబు పదవేల మీద కూర్చున్నాడనీ" చెప్పాడు. "ఏదో మరోమాట చెప్పమనలేక పోయావా?" అన్నాడు నరసయ్య ఆదుర్దాగా. "ఆఖరు మాట అయిదువేలని చెప్పా. కాదన్నాడు. పూర్వపు స్నేహం, బంధుత్వం ఏ కరువు పెట్టా! చివరకు ఎనిమిదివేలయితే రైట్ చెయ్యమన్నాడు. మాట్లాడివస్తానని చెప్పి వచ్చా." అన్నాడు రామయ్య. నరసయ్యకు ముచ్చెమటలు పోసినయి. కష్టపడి సంపాయించిన సొమ్ము. పొలానికి కొసలాకాసి, గొత్తెపెంట అమ్ముకొని, ఒకపూట తినీ, తినకా కూడబెట్టాడు. పాతికేండ్ల ఫలితం. తన సంపాదనేంటో భార్యకూడా తెలియదు. పరువు ప్రతిష్ఠలు నిలుపుకోవాలిగా. సంసారంమీద ఉండే మమకారం అలాంటిది." పైపంచె వేసుకుని "నడూ! రామయ్యా!" అన్నాడు.

నరసయ్య పొయ్యేసరికి మున్సబు లెఖ్ఖ రాసుకుంటున్నాడు. చూడ్డంతోటే 'మంచం వాల్చరా!' అన్నాడు జీతగాడితో. "కూచో బావా!" అంటూ పొరొచ్చే కొడలు మంచివి నాలుగేరి చుట్ట కాల్చుకోడానికి ఇచ్చాడు నరసయ్యకు రామయ్యకు. "నేను వచ్చిన విషయం నీకు తెలిసే ఉంటుంది బావా;" అన్నాడు నరసయ్య ఆప్యాయంగా పొగాకు పొర చీలుస్తూ. "అంతా రామయ్యతో చెప్పా! ఆప్రకారం కానీ!" అన్నాడు మున్సబు ఠీవిగా. "సరేలే బావా! తప్పేదేముంది? నీ ఇష్టప్రకారం పోతా" అన్నాడు నరసయ్య. అంటూనే తిలగుడ్డలోంచి తమలపాకులు తీసి 'వేసుకో బావా'



అంటూ చేతికిచ్చాడు ప్రథానానికి చిహ్నంగా. ముగ్గురూ ఆకులు వేసుకున్నారు ముసిముసినవ్వులు నవ్వుకుంటూ. "శ్రావణంలో ముహూర్తా లున్నాయట. శాస్తుర్లు చెప్పాడు" అన్నాడు నరసయ్య తిరిగీ. 'నీ చెల్లెలితో మాట్లాడి నేనే కబురు చేస్తాలేవోయ్!" అన్నాడు మున్సబు. సెలవు తీసుకుంటా బావా! అంటూ లేచాడు నరసయ్య రామయ్యతో. మర్నాటికల్లా ఊరంతా పాక్కిపోయింది. "నరసయ్య మునసబుతో వియ్యమందుకో పోతున్నాడనీ, పదివేల కట్నానికి ఖరారు పడ్డాడనీ." ఇంత పడ్డదంటే అంతా పడ్డదంటుంది లోకం. వాడవాడలా మూలమూలలా ఇదే ముచ్చట. నీళ్ళరేవులో అమ్మలక్కలు ముక్కుమీద వేలేసుకున్నారు. "రావమ్మ అదృష్టవంతురాలు" అంటున్నారు అందరూ. రచ్చబండమీద ముచ్చట్లు జోరుగా సాగుతున్నాయి. ఎవరినోట విన్నా ఇదేమాట. 'నర్సయ్య కింత డబ్బుందా?' అనీ, 'పదివేలంటే మాటలా?' అనీ, 'అసలు ఎప్పుడు సంపాయించాడనీ, అందరూ విస్తుపోతున్నారు. చివరకీవార్త పక్కఊరిలో ఉన్న పుల్లయ్యశెట్టికూడా తెలిసింది.

పూర్వం నరసయ్యతండ్రి పుల్లయ్యశెట్టి దగ్గర కొంత సొమ్ము బాకీ తీసుకున్నాడు. అక్కడే ఖాతాపెట్టి ఇంటికొక్కవలిసిన సామానంతా తెచ్చుకునేవాడు. పంటలేని ఏడు మరికొంత వాడుకునేవాడు. అమాంబాపతు పదిహేను వందలదాకా తేలింది. పద్దు వ్రాశి సంతకం చేయించుకున్నాడు శెట్టి రూపాయీ అర్థణావడ్డీతో. అదే ప్రతిఏటా తిరుగుతూఉంది లెఖల్లో. నరసయ్యతండ్రి చనిపోగానే లెక్క ఉతారు తీసి ఒప్పందం వ్రాయించుకున్నాడు శెట్టి నరసయ్యతో. గట్టిపద్దు. వడ్డీ పెరుగుతూ ఉంది. అంతగా పేచీవస్తే రెండెకరాల 'కొంప్రా' ఉందిగా! అనుకున్నాడు పుల్లయ్యశెట్టి. నరసయ్యదగ్గర పదివేలున్నాయనీ, మునసబుతో సంబంధం చేస్తున్నాడనీ, తెలియగానే శెట్టికి ఆశ్చర్యం కలిగింది. 'అమ్మ నరిసయ్యా! అంతవాడైనాడా?' అనుకున్నాడు. కాని అనుమానంగానే ఉంది. 'ఎందుకైనా మంచిది ఒకసారి వెళ్లితే' అనుకుని పాత లెక్కలు బయిటికి తీశాడు. వడ్డీ, లెక్కవేసిచూస్తే అసలు ఫాయిదాలు అయిదువేలుదాకా తేలింది. ఆలస్యం చేయకుండా దస్త్రంచం కనిబెట్టుకుని బయలుదేరాడు శెట్టి నరసయ్య దగ్గరికి. బండివచ్చి నరసయ్య ఇంటిముందు ఆగింది. సరాసరి లోపలికి వెళ్లాడు శెట్టి 'నరసయ్యబావ ఉన్నాడా అమ్మాయ్?' అంటూ. లోపలినుండి సీతమ్మ 'ఎప్పుడొచ్చావు అన్నయ్యా!' అంటూ బయటికి వచ్చింది. కాళ్లకు నీళ్లిచ్చి కట్లపీటవేసింది. 'ఆయన పొలంనుంచి వచ్చే వేళయింది అన్నయ్యా!' అంది సీతమ్మ. 'ఇల్లంతా మార్చారే' అన్నాడు శెట్టి గోడలవైపు చూస్తూ. 'లేదన్నయ్యా! ఈమధ్యనే బాగుచేయించాం' అంది సీతమ్మ తల తిప్పుతూ. 'మన అమ్మాయి రావమ్మకదూ! గుర్తుపట్టలేక పోయినా!' అన్నాడు శెట్టి గుడ్డలు కుట్టున్న రావమ్మను చూపిస్తూ. సీతమ్మ నవ్వుతూ 'పెద్దదయిందికదూ' అంది. సొమ్ముకూడా చేయించినట్లుంది' అన్నాడు శెట్టి తిరిగీ ఆశ్చర్యం కనపరుస్తూ. 'ఈమధ్యనే పెండ్లి ఖాయపర్చుకున్నాం. ముక్కులకూ, చెవులకూ, లేకపోతే బాగుండదనీ.....'అంది సీతమ్మ సందేహిస్తూ. ఇంతలో నరసయ్య వచ్చాడు. శెట్టిని చూచి 'ఎప్పుడొచ్చావు బావా?'అన్నాడు కాడి మూలన పెడుతూ. 'కాసేపయిందోయ్!' సమాధానం చెప్పాడు శెట్టి చుట్ట కాలుస్తూ. 'బావగారు పనిమీద వచ్చినట్టున్నారు.' అన్నాడు నరసయ్య శెట్టి చేతిలో దస్త్రం చూస్తూ. 'నీకు తెలియందేముందోయ్?' అన్నాడు తిరిగీ శెట్టి నవ్వుతూ. 'అన్నట్లు బాకీ...ఎంతయిందో తేల్చండి. సొమ్మిస్తాను. నేనే కబురు పంపుదా మనుకున్నా. రావమ్మ పెండ్లి సంబంధాల్లో పడి సుస్తీ జరిగింది!'అన్నాడు నరసయ్య తలగుడ్డ దండెంమీద వేస్తూ. శెట్టికి హడలు పుట్టింది, ఈ హంగామా అంతా చూచి. నరసయ్య ముఖంలో వెనుకటి విషాదరేఖలు లేవు. ఆ రీవి, ఆ మాటల ధోరణీ చూస్తే తాను విన్నది అబద్ధం కాదనుకున్నాడు శెట్టి సొమ్ము బాగా కూడింది. వడ్డీ పోగొట్టుకోవడ మెందుకు? అనుకున్నాడు మనసులో. 'నీకేమోయ్! బంగారంవంటి పద్దు. నీ బాకీవిషయంలో నాకు భయం ఎప్పుడూ లేదు. పిల్ల పెండ్లి కానీయి. నాకేం తొందర? చేతులో డబ్బుంటే ఎందుకైనా మంచిది. నే వెళ్లొస్తాను' అంటూ లేచాడు శెట్టి. 'మజ్జిగయినా పుచ్చుకోకుండా పోతావేం అన్నయ్యా!' అంది సీతమ్మ లోపల్నుంచి! 'నారయ్యతో పనుండి వచ్చానమ్మాయ్. మళ్ళీ వచ్చినప్పుడు విశ్రాంతిగా ఉంటాలే' అంటూ బండెక్కాడు శెట్టి.

ఆషాఢమాసం వెళ్లిపోతున్నా పొలాల్లో చినుకులేదు. ఊరంతా గగ్గోలుగా ఉంది. విత్తనం ఎట్లా వేసేది? అదను మించిపోతూ ఉంది. కూలిజనం అల్లాడుతున్నారు. పొలాల్లో పనుల్లేవు. కుండల్లో మెతుకు లేదు. ఏంచేస్తారు? కూడగట్టుకుని ఉన్న వాళ్ళ వాకిళ్ళల్లో కూర్చుంటున్నారు. నరసయ్య 'కొంప్రడను' దున్ని సిద్ధంగా ఉంచాడు. వర్షం పడడమే తరవాయి. కాని దేవుడికి దయ గలగలేదు. ఊళ్ళో గలభా అంతా చూస్తే భయం వేస్తున్నది నరసయ్యకు తనకేం మునుగుతుందో అని. పాతరనిండా గింజలున్నాయి. పదివేల రొఖ్ఖం ఉందని పడమటి వీధంతా ఏక




కేశవర్ధని అ 14, షాంపూ అ 14 అందరు డీలర్లవద్ద లభిస్తాయి.
లేక సౌత్ ఇండియా కెమికల్స్, క్రాస్‌కట్ రోడ్, కోయంబత్తూరుకు వ్రాయండి.

స్తున్నారు. ఎవర్ననీ ఆపడం ? పెళ్లెందుకు తలపెట్టానా ? అనుకుంటున్నాడు ఇప్పుడు నరసయ్య. అనుకున్నంతా అయింది. వడ్డెరపాటొచ్చి కూచుంది నరసయ్య ఇంటిముందు కాళ్లు పట్టుకుని కదల నివ్వడంలేదు. మునసబు కబురుచేశాడు. 'రేపు కోతల్లో, పంట నూర్పిళ్ళలో తీర్చుకుంటారు గింజలు కొలవాల్సిందే' అని తీర్పు చెప్పాడు మునసబు. నరసయ్య గుండెలు దడదడ కొట్టుకున్నయి వరసగా జనాన్ని కూర్చోబెట్టి గింజలు కొలిచాడు ఖరామానికతో. పాతర ఖాళీ అయింది. ఆ పాదమస్తకం చెమట పోసింది నరసయ్యకు. ఆయాసంకూడా వచ్చింది. అన్నంకూడా తినకుండా పక్కమీది కొరిగాడు. సంసారం, సంపాదన, వీట్లమీద అతనికుండే మమకారం ఆరాత్రంతా నిద్దర పట్టనీయలేదు. కన్ను మూయకుండా జాగారం చేస్తూ కూర్చున్నాడు.

తెల్లవారింది. మాదిగపాట్లో 'మహామ్మారీ' వచ్చిందని గ్రామంలోకి కబురు. నరసయ్య నమ్మలేకపోయాడు. చెంబు తీసుకుని 'పాటి' వైపు వెళ్లాడు నీరసంగా. జనం ఉరకలు పెడుతున్నారు. పెద్దోడింట్లో ఇద్దరికి తగిలిందనీ, అప్పుడే ఒకడు చచ్చాడనీ, చెపుతున్నారు. వణుక్కుంటూ ఇంటికి వచ్చాడు నరసయ్య. ఊరంతా పాక్కిపోయింది. మునసబు రిపోర్టు పంపాడు తాలూకాకు. మర్రోజే హెల్తుఇన్స్పెక్టరు, వాక్సినేటరు వచ్చారు ఇంటింటికీ తిరిగి ఇనాకులేషన్, చేశారు. ఫలితం శూన్యం. తూరుపు బజారున ముగ్గురు, వడ్డెరపాట్లో ఒక కుటుంబం నాశనం అయింది. నరసయ్య చూస్తుండగానే పక్కింటి రామయ్యకు తగలటం ప్రాణం వదలటం, జరిగింది. నరసయ్య బయటికి రావడమే లేదు. 'మహామ్మారీ' రావడం మళ్ళీ బ్రతకటమా ? అంటున్నారు అందరూ. 'అమ్మవారికి కోపం వచ్చిందేమో ? ఎన్నడూ లేదు. ఏమిటీ పీడ ఈ ఊరికి' అన్నారు మరి కొందరు. నాలుగురోజులు సద్దుమణిగింది. తిరిగీ రచ్చబండమీద ముచ్చట్లు ప్రారంభమైనాయి. రైతులంతా కూడుతున్నారు. 'కొండమీది గంగమ్మకు' కొలుపు చేయాలంటున్నారు. చివరకు కూడబలుక్కుని మున్సబు దగ్గరి కెళ్లారు రైతులంతా. 'చాలా పెద్దపని. బోలెడు డబ్బవుతుంది. యాటలు తెగుతయి.' అన్నాడు మునసబు సందేహిస్తూ. గ్రామం క్షేమం కోరి అయినా 'కొలుపు' చేయాల్సిందే' అన్నాడు. పెద్దకాపు. 'డబ్బో' అన్నాడు తిరిగీ మునసబు. 'ఉన్నవాళ్లను పెట్టమనండీ ! పంట వచ్చింతర్వాత లెక్కలు వేసుకోవచ్చు వంతులప్రకారం' అన్నాడొక యువకుడు 'ఉన్నాడుగా నరసయ్య పదివేల సంచితో. గ్రామానికి ఉపకారమైనా చేయకుండా ఏంచేస్తాడు ?' అన్నారు మరి కొందరు. 'సరే అడుగుదాం' అన్నాడు మునసబు. నరసయ్యను పిలిపించి విషయమంతా చెప్పాడు. తప్పించుకోలేక తలఊపాడు నరసయ్య. 'మొగుడికి మతిపోయిందా ఏం' అనుకుంటూ ఉందిసీతమ్మ.

ఉదయాన్నే తప్పెట్లు మోగినయి. ఇంటికొక బండి కట్టారు, బండ్లముందు కుంభంపోశారు. ఈరణాలతో, ఈరంగాలతో, బ్రహ్మాండంగా బయలుదేరింది ఊరేగింపు. కొట్టిన కొబ్బరికాయలకూ, కోసిన నిమ్మకాయలకూ లెక్కలేదు. నర్సయ్యబండి ముందు నడిచింది. కొండచుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసినయి బండ్లన్నీ. గంగమ్మ ముందు యాటలు తెగినయి. ఖడ్గాలు చదివారు. కథలు చెప్పారు. మూడురోజులూ 'జాతర' కోలాహలంగా జరిగింది. నాలుగోరోజు అన్నదానం. ఊరబంతి పెట్టారు. నరసయ్య నడుంకట్టి వడ్డించాడు. దేవుడు కరుణిస్తాడని ఆశపడ్డాడు. అన్నం తింటూనే 'అయ్యా ఒళ్లు నొప్పులుగా ఉన్నయి' అన్నాడు రవణయ్య తండ్రితో. 'నిద్రలేక లేరా' అన్నాడు నరసయ్య అమాయకంగా. రవణయ్యకు పొంగులతో జ్వరంవచ్చింది. చూస్తుండగనే చంకల్లో బొబ్బ లెక్కినయి. ఎగిరిపడి ప్రాణం విడిచాడు రవణయ్య. జాతర చేయించుకుని నరసయ్య కొడుకుని బలి తీసుకుంది గంగమ్మదేవత. మొదలు కొట్టిన చెట్టులాగా కూలిపోయినాడు నరసయ్య. కడుపుదుఃఖంతో సీతమ్మ క్రుంగిపోతూ ఉంది. స్పృహ లేకుండా పడిఉంది. రావమ్మ 'అన్నా' అని ఏడ్చింది. మునసబు వచ్చి ఆదరించి పోయినాడు.

మూడోనాడు పద్తూ పద్తూ లేచాడు నరసయ్య. రెండుమూడుసార్లు వాంతులయినయి. కొరంలోనే దొడ్డి కెళ్లాడు. పడబోతుంటే పట్టుకుంది సీతమ్మ. 'అట్లా ఉన్నావేం ? అయ్యా !' అంది రావమ్మ. 'వళ్ళు మండుతున్నది' అన్నాడు నరసయ్య భారంగా. అరగంట తర్వాత నరసయ్యకు కళ్లు మూతలుపడ్డయి. సీతమ్మ మట్టిలోపడి పొర్లాడింది. ఏమైతేనేం? పండంటి సంసారం భగ్నమై పోయింది. మట్టిలో కలుస్తూ గూడా నరసయ్య మమకారాన్ని వదలలేక పోయాడు. ఎద్దులకు గాలికుంటు తగిలింది. ఒక్కరైనా ఆదరించలా. ఇంట్లో గింజ మిగల్లేదు. తెచ్చుకోడానికి రాగి దమ్మిడీ లేదు. ఏమైంది మొగుడు సంపాయించిందంతా ? గింజలు కొలిచాడు. కొలుపులకు ఎంతయిందో ? ఎవరిదగ్గర ఎంత రావాలో ? సీతమ్మగుండె చెరువయింది. రావమ్మ దిగులు పడుతుందని దుఃఖం ఆపలేక ఆపుకుంటున్నది.

పది రోజులయినా గడవలా. ఎట్లా తెలిసిందో శెట్టికి. గాభరాగా వచ్చాడు బండి కట్టుకుని. 'చాలా అన్యాయం జరిగింది అమ్మాయి.' అన్నాడు సీతమ్మను చూచి. సీతమ్మ తలవంచి సమాధానం చెప్పలేదు. "ఆ బాకీ పరిష్కారం చేస్తారేమో' అని వచ్చాను' అన్నాడు శెట్టి తిరిగీ. సీతమ్మ కళ్లు జ్యోతుల్లా అయినాయి. 'మా అయ్యల్ని మహమ్మారి మింగింది. మా సంపాదన ఊరు మింగింది. ఇక మేమే మిగిలాం తిసుకుపో' అంది సీతమ్మ రుద్దకంఠంతో. ఇప్పుడు తప్పితే బాకీ రాదని నిశ్చయించుకొని శెట్టి నట్టింట కూర్చుని దస్త్రం తెరిచాడు. ★

స్టీల్ మాష్టరు
( మడత కుర్చీలు )

ధర
రు. 16/
అథరైజ్డు డీలర్సు
మాధవ అండ్ కో
పార్కు రోడ్డు, బెజవాడ
ఆంధ్రదేశమందు ప్రతి పట్టణములోను
యేజెంట్లు కావలెను.

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
కుష్ఠు, బొల్లి, సుఖ రోగోది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలు మందులు చూసి మోస పోకుడు
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.